ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 204 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 31 అక్టోబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

పద్మశాలిపురం ఘర్షణ బాధితుడు పున్న రాజు పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి:

బీఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి... ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఉన్న రాజును పరామర్శించిన కార్తిక్ రెడ్డి



రాజేంద్రనగర్,అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం భూలక్ష్మమ్మ దేవాలయం వద్ద అమ్మవారి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా రెండు వర్గాల యువకుల మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన పున్న రాజును రాజేంద్రనగర్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు.ఘటనలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందిన పున్న రాజు డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న కార్తిక్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.అమ్మవారి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘర్షణలో పున్న రాజుపై దాడి జరగడంతో తీవ్ర గాయాలయ్యాయని,ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు వివరించారు.అయితే కేసు నమోదు చేసినప్పటికీ విచారణలో ఆశించిన పురోగతి లేదని,నిందితుల అరెస్టులో జాప్యం జరుగుతోందని వారు కార్తిక్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన ఆయన వెంటనే పోలీసులతో మాట్లాడి కేసు దర్యాప్తు పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.బాధితులకు న్యాయం జరిగేలా విచారణ వేగవంతం చేసి,దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు.దీనికి స్పందించిన సీఐ పరారీలో ఉన్న వారిని త్వరలోనే పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిస్తామని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని,న్యాయం జరిగే వరకు అవసరమైన సహకారం అందిస్తామని కార్తిక్ రెడ్డి భరోసా ఇచ్చారు.పరామర్శించిన వారిలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్,డి. రమేష్ ముదిరాజ్,రఘు యాదవ,మైసిరెడ్డి,కొంపల్లి జగదీష్,రాజేష్ నాయుడు తదితరులు ఉన్నారు

మియాపూర్‌లో... 50 వేల కోట్ల భూమిని కాపాడాం

ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూముల స్వాధీనం

మియాపూర్ భూముల్లో కేసీఆర్ బంధువులపై ఆరోపణలు

సుప్రీం తీర్పుపై కేటీఆర్ కెసిఆర్ స్పందించాలి : రేవంత్



న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)

మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, ..మిగతా 2లో

జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో...ఇళ్ల స్థలాలు

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)

జర్నలిస్టులకు ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారు. ప్రజాప్రతినిధులు,ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తులు, ఇతరుల ప్రభావాలకు తావులేకుండా కేవలం జర్నలిస్టుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ స్థలాల కేటాయింపు చేపడతామని స్పష్టం చేశారు.ఈ వ్యవహారాన్ని డిసెంబర్ 9వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని సీఎం హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు అవసరమైన భూమిని అంచనా వేసి, 15 రోజుల్లోగా ఫ్యూచర్ సిటీ లేఅవుట్ సిద్ధం చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేసి సూచించారు. ఈ సందర్భంగా విలేకరుల సమక్షంలోనే ఆయన మంత్రితో మాట్లాడటం ప్రాధాన్యత సంతరించుకుంది.ప్లాట్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ, ఇతర ప్రభావాలకు అవకాశం లేకుండా పారదర్శక విధానాన్ని అనుసరించాలని సీఎం ప్రతిపాదించారు. చిన్న పిల్లల చేతుల మీదుగా లక్కీ డ్రా (లాటరీ) నిర్వహించి అర్హులైన జర్నలిస్టులకు ప్లాట్లు కేటాయించే విధానాన్ని సూచించారు. ఈ ప్రక్రియకు తుది రూపు ఇచ్చేందుకు జర్నలిస్టులు వెంటనే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి అవసరమైన వివరాలు అందించాలని సీఎం సూచించారు.

ఆ బంధం రేప్ కాదు

మోసం, పశ్చాత్తాపం మధ్య తేడా ఉంది

ఇరు పక్షాల ఆంగీకార శారీరక కలయిక అత్యాచారం అనలేం

బంధాలు విఫలమైతే క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి సరికాదు

అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)

రెండు మనసుల మధ్య పరస్పర అంగీకారంతో సాగిన బంధం కాలక్రమేణా వికటించినంత మాత్రాన, గతంలో జరిగిన శారీరక సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా మార్చలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. బంధాలు విఫలమైన ప్రతిసారీ వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతుండటం పట్ల అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. “తొలినాళ్ల నుంచే ఉద్దేశపూర్వక మోసం, దగాతో పొందిన ..మిగతా 2లో

పంచాయతీలకు మాస్టర్ ప్లాన్

జీపీఎస్‌పీ - 2026 మార్గదర్శకాలు జారీ


జీపీఎస్‌పీ తయారీకి జీవో విడుదల

ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్, డాష్‌బోర్డులు

హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)



గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేసి రైజింగ్ తెలంగాణ 2047లో కీలక భాగస్వామ్యం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే మొదటిసారి ప్రతీ గ్రామపంచాయతీకి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక –జీపీఎస్‌పీ తయారు చేయాలని నిర్ణయించింది. గ్రామానికి సంబంధించిన సమగ్ర డేటా సేకరించి, ఐదేళ్ల అభివృద్ధికి స్పష్టమైన కార్యచరణ చేపట్టేలా గ్రామపంచాయతీకి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూల్స్ విడుదల చేసింది. ప్రణాళిక తయారీలో పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు బాధ్యతలు కేటాయించిన ప్రభుత్వం, అధికారులు సమాచారం ఇవ్వకపోయినా, తప్పుడు వివరాలు ఇచ్చినా చర్యలు ఉంటాయని నిబంధనల్లో స్పష్టం చేసింది. గ్రామాల స్వయం సమృద్ధి, సమగ్ర వికాసమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రయత్నం ప్రారంభించింది. రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం పంచాయతీరాజ్ శాఖ నిబంధనలు ఖరారు చేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పంచాయతీరాజ్ చట్టం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, తెలంగాణ రైజింగ్ 2047 కు అనుగుణంగా గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని సంకల్పించింది. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను మూడు విభాగాలుగా శాస్త్రీయంగా రూపొందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

ఓటర్ల జాబితా సవరణ లీ షెడ్యూల్

రాష్ట్రాల సీఈఓల అభ్యర్థనతో నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా, నాగాలాండ్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా రాష్ట్రాల సీఈఓల అభ్యర్థన మేరకు ఈ ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను సవరిస్తూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గడువు పెంపు వివరాలను తెలియజేస్తూ ఐదు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీ ముఖ్య ఎన్నికల అధికారులకు (సీఈఓ) ఎన్నికల సంఘం వేర్వేరుగా లేఖలు రాసింది. వివిధ సాంకేతిక, పరిపాలనా కారణాల వల్ల గతంలోనూ పలుమార్లు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ గడువును పొడిగించిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, ఫిర్యాదుల దాఖలు గడువును అక్టోబరు 26 నుంచి నవంబరు 13 వరకు పొడిగించారు. నోటీసుల జారీ, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ నవంబరు ..మిగతా 2లో

దంచి కొట్టిన వాన

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం



హైదరాబాద్, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం హైదరాబాద్ నగరంపై పడింది. మధ్యాహ్నం వరకు మామూలుగానే ఉన్నా, సాయంత్రం నుంచి దట్టమైన మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో నగరమంతటా వర్షం కురిసింది. చాలారోజుల తరువాత కురిసిన ఈ వర్షం నగర వాసులను ఇబ్బందులు పెట్టింది. గాలి వానకు విద్యుత్ నిలిచి పోవడంతో పాటు రహదారులపై నీరు చేరి వాహన దారులకు నరకం చూపించింది.భాగ్యనగరంలో సాధారణంగానే సాయంత్ర వేళ ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు వదిలే సమయం కావడంతో మామూలుగానే రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. దానికి తోడు ఈదురు గాలులు, వర్షం తోడవటంతో వాహనదారుల కష్టాలు రెట్టింపయ్యాయి. ముందుగా కాప్రా పరిధిలో మొదలైన వర్షం క్షణాల్లోనే నగరమంతటా విస్తరించింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో చాలా ప్రాంతాల్లో నగరవాసులను భయాందోళనలకు గురి చేసింది. బహదూర్‌పురాలో అత్యధికంగా 6.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మాదాపూర్‌లో 5.7 సెం.మీ., షేక్‌పేట్‌లో 5.5 సెం.మీ, చార్మినార్‌లో 4.7 సెం.మీ, జూబ్లీహిల్స్ 4.4 సెం.మీ, అత్తాపూర్ 4.3 సెం.మీ, సిఫ్‌నగర్‌లో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా కురిసిన వర్షానికి జనాలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఐటీ హబ్ అయిన మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం వల్ల రహదారులపైకి నీరు చేరడంతో వాహనాలు చాలా నెమ్మదిగా కదులుతున్నాయి. రహదారులపై నిలిచిన వాననీటితో ఆయా మార్గాల్లో ప్రయాణించే ఉద్యోగులు, మాదాపూర్ – హైటెక్ సిటీ – కేపీహెచ్ బీ మార్గంలో మైండ్‌స్పేస్, ఐకియా పరిసర ప్రాంతాల్లో రద్దీ పెరిగి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. మాదాపూర్ సిటీ వైన్స్ సమీపంలోని ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది.

డోర్ టు డోర్.. పార్సిల్..డెలివరీ..!

రైల్వేలో సరికొత్త సేవలు

ఘర్ సే ఘర్ తక్ పేరుతో పథకం

ప్రయోగాత్మకంగా కొన్ని నగరాల్లో అమలు

త్వరలోనే మరికొన్ని సిటీలకు విస్తరణ

జోగుళాంబ గద్వాల జిల్లాను సురక్షిత్ ప్లస్ హోదా దిశగా

తీసుకెళ్లేందుకు సమన్వయంతో కృషి చేయాలి

హెచ్ఐవీ నివారణలో అంకితభావంతో పనిచేసిన సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణలో సాధించిన ప్రగతిని కొనసాగించాలి -- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం):



మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ -- సురక్ష కార్యక్రమంలో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లా సురక్షిత్ హోదా సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ -- సురక్ష కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ,ఎయిడ్స్ నివారణకు సమన్వయంతో కృషిచేసిన అధికారులు,వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జిల్లా కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో నివారణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.జిల్లా సాధించిన సురక్షిత్ హోదా ఒక ముఖ్యమైన విజయమని,ఈ గుర్తింపుతో బాధ్యత మరింత పెరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఇప్పటివరకు సాధించిన ప్రగతితో సంతృప్తి చెందకుండా,ఇదే స్ఫూర్తి, అంకితభావంతో ముందుకు సాగాలని తెలిపారు.హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా మొబిలైజేషన్ కార్యక్రమాలను విస్తృతం చేయాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ శాఖలు, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీటీసీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ ఆధారిత సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేయడం ద్వారానే ఆశించిన ఫలితాలను సాధించగలమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, అర్హులైన వారికి పరీక్షలు, కౌన్సెలింగ్,చికిత్స, అవసరమైన సహాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా,వారికి గౌరవం, భరోసా కల్పించే విధంగా సమాజంలో అవగాహన పెంపొందించాలని తెలిపారు.జిల్లా సాధించిన జాతీయ స్థాయి గుర్తింపును స్ఫూర్తిగా తీసుకొని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, జోగులాంబ గద్వాల జిల్లాను సురక్షిత్ ప్లస్ హోదా దిశగా తీసుకెళ్లేందుకు అధికారులు,సిబ్బంది,స్వచ్ఛంద సంస్థలు సమష్టి బాధ్యతతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సురక్షిత్ హోదా సాధనలో విశేష కృషి చేసిన వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది,కౌన్సెలర్లు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బందిని జిల్లా కలెక్టర్ జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్మయి,జిల్లా ప్రోగ్రాం అధికారి రాజు,దిశ సీపీఎం రమేష్, సీఎస్ఓ రవీంద్ర రెడ్డి,డీఎంఓడీ సాయికుమార్,వైద్య సిబ్బంది, ఐసీటీసీ,పీపీటీసీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులు నవీన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు









నూతన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం)

కేటిదొడ్డి మండలం సీనియర్ నాయకులు నవీన్‌రెడ్డి స్వగ్రామమైన పాగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన గృహప్రవేశ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి, తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి, ఉమ్మడి డీసీసిబి డైరెక్టర్ సుభాన్, నాయకులు , కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, జర్నలిస్టులు విజయ్, సుదర్శన్, లోకేష్, వేంకటేష్, రఘునాథ్‌రెడ్డి, నల్లన్న, నందు,గోకారి, మల్లికార్జున్, రామాంజనేయులు, రవిబాబు, మల్లేష్ గౌడ్, గోపి,తదితరులు హాజరై నూతన గృహాన్ని సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గృహ యజమానికి, వారి కుటుంబ సభ్యులకు శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు ఆశీస్సులు అందజేశారు.

డోర్ టు డోర్.. పార్సిల్..డెలివరీ..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం)

ప్రయాణికులకు భారతీయ రైల్వే గుడ్ న్యూస్ చెప్పింది. కొరియర్ సంస్థల తరహాలో డోర్ టు డోర్ పార్సిల్ డెలివరీ సేవలను ప్రారంభించనున్నట్లు భారతీయ రైల్వే తెలిపింది. ఈ మేరకు 'ఫర్ సే ఫర్ తక్' పేరుతో ఇంటి వద్దకే వచ్చి పార్సిళ్లను సేకరించడం, గమ్యస్థానానికి చేరవేయడం వంటి సేవలను ప్రారంభించనుంది. ఈ సేవలను తొలుత దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరు, పుణె నగరాల్లో వీటిని ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం రైల్వే శాఖ ప్రత్యేకంగా 'రైల్ పార్సిల్ యాప్'ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ విధానంలో రైల్వే శాఖ ప్రైవేట్ లాజిస్టిక్స్ సంస్థలతో కలిసి పని చేయనుంది. మొదట లాజిస్టిక్స్ సంస్థల ప్రతినిధులు వినియోగదారుల ఇళ్లకు వచ్చి పార్సిళ్లను సేకరిస్తారు. అనంతరం వాటిని రైల్వే స్టేషన్‌కు చేర్చుతారు. అక్కడి నుంచి రైళ్ల ద్వారా గమ్యస్థాన నగరానికి పార్సిళ్లు చేరుకుంటాయి. చివరగా అక్కడి లాజిస్టిక్స్ సంస్థలు సంబంధిత చిరునామాకు పార్సిళ్లను డెలివరీ చేస్తాయి. ఈ యాప్ ద్వారా పార్సిల్ బుకింగ్, లైవ్ ట్రాకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు సదుపాయాలు పొందవచ్చు. ప్రతి బుకింగ్‌కు ప్రత్యేకమైన 10 అంకెల పీఆర్ఆర్ నంబర్ కేటాయిస్తారు. యూపీఐ, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. డెలివరీ సమయంలో ఓటీపీ ద్వారా ధ్రువీకరించాల్సి ఉంటుంది. రైలు బయలుదేరడానికి 15 రోజుల ముందు నుంచి ప్రయాణానికి ఒక రోజు ముందు వరకు బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. పార్సిల్ తీసుకునేలోపు బుకింగ్ రద్దు చేస్తే, రూ.10 క్లరికేజ్ ఛార్జీ మినహాయించి రైల్వే రవాణా ఛార్జీని తిరిగి చెల్లిస్తారు. ఈ సేవలతో చిన్న వ్యాపారులు, ఆన్‌లైన్ విక్రేతలు, సాధారణ వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.



ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి...

25 వరకు కొనసాగుతుంది. తుది ఓటర్ల జాబితాను నవంబరు 30న ప్రచురించనున్నారు. నిజానికి ఇక్కడ ఆగస్టు 31న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయగా, క్లెయిమ్‌ల పరిష్కారానికి గతంలో నవంబరు 10ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీలో అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ గడువును అక్టోబరు 30 నుంచి నవంబరు 25 వరకు పొడిగించారు. దరఖాస్తుల పరిష్కార గడువును నవంబరు 30 నుంచి డిసెంబరు 15కి మార్చారు. అన్ని పరిశీలనల అనంతరం డిసెంబరు 22న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు హర్యానా, నాగాలాండ్ రాష్ట్రాల్లోనూ సవరించిన తేదీలకు అనుగుణంగా ఓటర్ల నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియ కొనసాగనుంది. అర్హులైన పౌరులు ఈ పొడిగించిన(నవంబర్ 26) గడువును వినియోగించుకుని ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. తుది జాబితాను నవంబర్ 30వ తేదీన ప్రకటిస్తారు.

మియాపూర్‌లో...

50 వేల కోట్ల భూమిని కాపాడాం

మొదటి పేజీ తరువాయి...

బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ఆ బంధం రేప్ కాదు

మొదటి పేజీ తరువాయి...



లైంగిక సమ్మతికి... సంబంధం మ-ుగిసిన తర్వాత కలిగే పశ్చాత్తాపానికి మధ్య తేడాను గుర్తించాల్సిన అవసరం ఉంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సజావుగా సాగుతున్న బంధంలో ఇరుపక్షాల అంగీకారంతో జరిగిన శారీరక సాన్నిహిత్యాన్ని, ఆ బంధం విచ్ఛిన్నమైన తర్వాత క్రూరమైన అత్యాచారంగా ముద్ర వేయడం సరికాదని న్యాయస్థానం పేర్కొంది. బాధిత వ్యక్తులు బంధం తెగిపోయిన తర్వాత వెనక్కి తిరిగి చూసుకుని వ్యక్తం చేసే అసంతృప్తి, ఒక నేరంగా మారదని కోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి విధానం క్రిమినల్ న్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టించడమే కాకుండా, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్వేచ్ఛను, గౌరవాన్ని భంగపరుస్తుందని తెలిపింది. "ఒకానొక సమయంలో సమ్మతితో కూడిన సంబంధంలో ఉన్నంత మాత్రాన, భవిష్యత్తులో రేప్ కేసు పెడతారనే భయంతో ఆ పురుషుడు అదే బంధంలో బందీగా ఉండిపోవాలా? బంధం నుంచి వైదొలిగే హక్కు అతనికి ఉండదా? అలా వైదొలగడాన్ని మోసంగా ఎలా పరిగణిస్తారు?" అని ధర్మాసనం ప్రశ్నించింది.

అసలైన నేరాల తీవ్రత తగ్గుతుంది

నిజమైన లైంగిక దాడి, బలవంతం, లేదా వంచనతో అంగీకారం పొందిన తీవ్రమైన కేసుల్లో మాత్రమే అత్యాచార నిరోధక చట్టాలను ప్రయోగించాలని న్యాయమూర్తులు హెచ్చరించారు. వికటించిన ప్రతి సమ్మత సంబంధాన్ని రేప్‌గా చిత్రీకరిస్తే, నిజమైన లైంగిక నేరాల తీవ్రత తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. కేరళకు చెందిన సంతోష్ కుమార్ ఎన్.పి. అనే వ్యక్తిపై నమోదైన రేప్, దగా, నమ్మకద్రోహం కేసులను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. గతంలో తనపై నమోదైన కేసులను కొట్టివేసేందుకు కేరళ హైకోర్టు నిరాకరించడంతో ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. నిందితుడు తనకు మొదటి పెళ్లి అయిన విషయాన్ని దాచిపెట్టి, బాధిత మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడని, అక్రమ వివాహం ద్వారా పొందిన సమ్మతితో తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఆ మహిళ ఆరోపించారు. వీరు 1996 నుండి 2003 వరకు మైసూర్‌లో వివాహం చేసుకుని కలిసి నివసించారు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు, సంతోష్ కుమార్‌పై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేస్తూ ఈ కీలక తీర్పు వెలువరించింది.



మైలార్ దేవుపల్లి లో సమస్యలు తెలుసుకుంటున్న టీడీపీ నాయకులు ఉస్మేమూరి విజయ్ కుమార్

మైలార్దేవుపల్లిలో టీడీపీ నాయకులు యు విజయ్ కుమార్ పర్యటన

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం)

మైలార్దేవుపల్లి లో శుక్రవారం టీడీపీ నాయకులు ఉస్మేమూరి విజయ్ కుమార్ పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రోడ్ల పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నదే టీడీపీ ఉద్దేశ్యం అన్నారు. అధికారులు బస్తీలలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.



ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరు మృతి... ఇద్దరికి తీవ్ర గాయాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం)

మల్దకల్ మండలం శేషంపల్లి స్టేజ్ సమీపంలో మల్దకల్ – అయిజ ప్రధాన రహదారిపై శుక్రవారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరొక్కరికి స్వల్పగాయాలయ్యాయి.మల్దకల్ ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరలిలా ఉన్నాయి. అయిజ మండలం సీటిపాడు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్, మహేష్ (25), ఇద్దరూ కలిసి బైక్‌పై గద్వాల కు వస్తున్నారు. అదే సమయంలో కర్నూల్ జిల్లాకు చెందిన లోకేష్, రవికుమార్, అయిజకు చెందిన ఏసన్న ముగ్గురు కలిసి బైక్ పై మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామంలో జరిగిన ఓ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై తిరిగి అదే బైక్ పై అయిజ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో శేషంపల్లి స్టేజ్ సమీపంలో ఎదురెదురగా వస్తున్న రెండు బైక్‌లు బలంగా ఢీకొట్టాయి.ఈ ప్రమాదంలో బైక్‌లపై ఉన్నవారు తీవ్రంగా గాయపడ్డారు. మల్దకల్ పోలీసులు, స్థానికులు గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం ఆంబులెన్స్ లో గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో మహేష్ (25) మరియు లోకేష్ (25) గద్వాలజిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.తీవ్రంగా గాయపడిన కిరణ్ కుమార్, రవికుమార్, ఏసన్నలకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే అయిజ మండలం సీటి పాడుకు చెందిన కిరణ్ కుమార్ బైక్‌ను నడుపుతూ ముందుగా వస్తున్న బస్సును ఓవర్ టేక్ క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు, బాధితులు తెలిపారు. మల్దకల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్‌లో గుర్తుతెలియని వృద్ధుడు ఆసుపత్రికి తరలింపు

ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి

పటాన్ చెరు, అక్టోబర్ 30 (ప్రభాత ఉదయం):



రోడ్డుపై స్పృహతప్పి పడి ఉన్న ఓ గుర్తుతెలియని వృద్ధుడిని స్థానికులు, పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.పోలీసులు విడుదల చేసిన ప్రకటన వివరాల ప్రకారం సుమారు వారం రోజుల క్రితం బీరంగూడలోని జెనెసిస్ హైస్కూల్ సమీపంలో 60 నుంచి 70 ఏళ్ల వయసు కలిగిన ఓ వృద్ధుడు మూర్ఛ (ఫిట్స్) రావడంతో రోడ్డుపై పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ వ్యక్తి అనారోగ్యం, మానసిక స్థితి కారణంగా తన పేరు, ఊరు, కుటుంబ వివరాలను చెప్పలేకపోతున్నాడని పోలీసులు తెలిపారు.సదరు వ్యక్తి ఆనవాళ్లు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వయస్సు సుమారు 60 నుంచి 70 సంవత్సరాలు,నలుపు రంగు శరీర ఛాయ, నలుపు-తెలుపు రంగు కలిసిన జుట్టు, తెల్లటి గడ్డం.నీలం రంగు రౌండ్ నెక్ టీ-షర్ట్ ధరించి ఉన్నట్లు ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి ఎవరైనా తప్పిపోయినట్లు తెలిసినా, లేదా కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే తమను సంప్రదించాలని అమీన్‌పూర్ ఎస్‌హెచ్‌వో ప్రవీణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లుఎస్‌హెచ్‌వో (అమీన్‌పూర్) 8712656728,ఎస్ఐపీ (అమీన్‌పూర్): 8712581445, అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్: 8712661842 నెంబర్ల కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

తెలంగాణలో కరువుతో అల్లాడుతున్న అన్ని మండలాలను

కరువు మండలాలుగా ప్రకటించాలి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం)

ఎల్సీనో ప్రభావం కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని 365 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, ఇంకా అనేక మండలాలలో కరువు ఉందని, ఆ మండలాలన్నింటిని కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ లోని రాజేంద్రనగర్ లో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్) లో శుక్రవారం జరిగిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐఆర్ఆర్ నిర్వహించిన రైతు దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం రైతులు, శాస్త్రవేత్తలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. రైతులు వంట వేసుకుని చేతికొచ్చే దాకా టెన్షన్ లో ఉంటారని గుర్తు చేశారు. రైతులకు నెలకు రూ.12వేల కంటే ఎక్కువ ఆదాయం రావడం లేదని, సంవత్సరానికి రైతు రూ.15లక్షలు మాత్రమే సంపాదిస్తున్నాడని. అదే ఒక సాఫ్ట్వేర్ నెలకు రూ. 2లక్షలు సంపాదిస్తున్నాడన్నారు. అయినా రైతులు నిరుత్సాహంకు లోను కాకుండ వ్యవసాయం చేస్తున్నారన్నారు. 2014 కంటే ముందు భారత్ కు వరి ని దిగుమతి చేసుకునేవారమని, నేడు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. జై జవాన్ – జై కిసాన్ అనే నినాధాన్ని భారత ప్రధాని నిజం చేయడానికి కంకణం కట్టుకుని ముందుకు సాగుతున్నారన్నారు. అన్నం పరబ్రమ్మ స్వరూపమని, రైతు కూడా అన్నదాన ప్రభువని గుర్తు చేశారు. రైతులకు చేయూతనివ్వడానికి వారిలో ఆర్థిక భరోసా కల్పించడంలో భాగంగానే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

2019 నుంచి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 23 విడతల్లో రైతుల ఖాతాలలో రూ. 4.47లక్షల కోట్లు జమా చేసినట్లు తెలిపారు. తాజా గా 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,690 కోట్లను జమా చేస్తున్నట్లు తెలి పారు. తెలంగాణ లో 30 లక్షల మందికి పైగా రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. పీఎం కిసాన్ నిధుల్లో 92శాతం మొత్తాన్ని రైతులు వ్యవసాయ అవసరాలకే ఖర్చు చేస్తున్నారని, దీని వల్ల 85శాతం మంది రైతుల ఆదాయం పెరిగిందని నీతి అయోగ్ నివేధిక లో వెల్లడించారన్నారు. రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎరువుల సబ్సిడీ కోసం రూ.12లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ సబ్సిడీ ద్వారా రైతులకు ఎకరాకు సుమారు రూ.18వేల వరకు ఆదా అవుతుందని పేర్కొన్నారు.తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను అందించామన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాదించాలంటే రైతులను అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వాములను చేయాలన్నదే ప్రధాని మోడీ సంకల్పమన్నారు. రైతు ముఖంలో చిరునవ్వే శాస్త్రవేత్త విజయానికి అసలైన గుర్తింపు అన్నారు.రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తే భారత వ్యవసాయ రంగాన్ని ప్రపంచంలో అగ్ర స్థానానికి తీసుకెళ్ల గలుగుతామన్నారు. అందరు కలసి కట్టుగా పనిచేసి రైతును రారాజుగా చేయాలన్నారు. ప్రజలందరు, రైతులు సంతోషంగా ఉండటానికి నిరంతరం కృషి చేస్తున్న శాస్త్రవేత్తలను మంత్రి బండి సంజయ్ అభినందించారు. సభికులందరి చేత వారికి చప్పట్లు కొట్టించారు. అంతకు ముందు మాట్లాడిన ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాస ప్రసాద్ వరి ద్వారా సంవత్సరానికి వెయ్యి కోట్ల విదేశీ మాదక ద్రవ్యాన్ని సాదిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎస్ మీరా, ప్రకృతి ఎన్విరాన్మెంట్ సోసైటీ ప్రతినిధి ఎం జయశ్రీ, ఐఐఆర్ఆర్ కు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ వి సాయి ప్రసాద్, డాక్టర్ జ్యోతి భద్రి, డాక్టర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



క్లైమెట్ ఇంటెలిజెన్స్ రెవల్యూషన్ బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ దండ రాజి రెడ్డి, డాక్టర్ బి గోపి తదితరులు

వ్యవసాయ, ఉద్యాన పంటల ఒడి దుడుకులను తట్టుకునేందుకు ఇంటలిజెన్స్ రెవల్యూషన్ దోహదం

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం)

భారత దేశంలో వ్యవసాయ, ఉద్యాన రంగాలలో పర్యావరణ ఒడి దుడుకులను తట్టుకునేందుకు దీటైన మార్గంగా గేమ్ చేంజర్ గా క్లైమట్ ఇంటలిజెన్స్ రెవల్యూషన్ ఉండనుందని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు క్లైమట్ ఇం టలిజెన్స్ రెవల్యూషన్, అగ్రి బిజినెస్ మోడలింగ్ పై జరుగుతున్న జాతీయ సదస్సు లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ యువతకు భవిష్యత్తులో ఈ రంగం ప్రధాన ఉపాధి అవకాశాలు కల్పిం చనున్నట్లు అభిప్రాయ పడ్డారు. వెదర్ ఫోర్ కాస్టింగ్, క్లైమట్ చేంజ్ వంటి పదాలు, వాటి ప్రాముఖ్యత ప్రస్తుతం రైతులు, ప్రజల జీవనంలో ఒక బాగమని అన్నారు. వెదర్ డేటా బేస్ సేకరణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందుందన్నారు. పర్యావరణ మార్పుల వల్ల కలిగే ఎన్ ని నో, తుఫాన్ వంటి విపత్తు లను ధీటుగా ఎదుర్కొనేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాలని, రైతులకు ఈ ఫలితాలు చేరేలా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి అన్నారు. వాతావరణ సమాచారం రైతు స్థాయిలో అందుబాటులో ఉంటే, రైతు తమ స్థాయిలో నిర్ణయాలు తీసుకుని, ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు, సాగు ద్వారా ఉత్పాదకతను పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని ప్రపంచబ్యాంకు లాంటి సంస్థలు కూడా చెబుతున్నాయని గుర్తు చేశారు. వెదర్ ఫోర్ కాస్ట్ లు మరింత రియాలిస్టిక్ గా ఉండాలన్నారు. డిజిటల్ క్రాప్ డేటా బేస్ లో తెలంగాణ రాష్ట్రంలో 55 లక్షల మంది రైతులకు పైగా సమాచారం ఉందని, కేంద్ర పథకాలు, పంట రుణాలు, వాతావరణ సమాచారం చేరవేత వంటి అంశాలలో ఈ డేటా బేస్ భవిష్యత్తులో ఉపయోగపడుతుందని గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ బెట్రిచ్ వింగ్ అడ్వయిజర్, హెడ్ డాక్టర్ జేవీ సింగ్ తో పాటు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

అక్రమార్కుల ఆటలకు సుప్రీంకోర్టు చరమగీతం!

మియాపూర్‌లో రూ.60 వేల కోట్ల విలువైన 550.39 ఎకరాలు ప్రభుత్వానివే.. 19 కేసులపై ఒకే తీర్పుతో భూదందాకు చెక్!

నకిలీ పత్రాలు, తప్పుడు రికార్డులతో ప్రభుత్వ భూమిపై హక్కులంటూ సాగిన పోరుకు తెర.. ఖాళీగా ఉన్న 400 ఎకరాలకు ప్రభుత్వ భూమికి కంచె వేయాలని కలెక్టర్ ఆదేశం

శేరిలింగంపల్లి : అక్టోబర్ 30, (ప్రభాత ఉదయం)

వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై దశాబ్దాలుగా సాగుతున్న న్యాయపోరాటానికి దేశ అత్యున్నత న్యాయస్థానం తెరదించింది. హైటెక్ నగరంలోని మియాపూర్ సర్వే నంబర్లు 100, 101 పరిధిలోని 550.39 ఎకరాల భూమి ప్రభుత్వానికే చెందుతుందని సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రక తీర్పుతో భూవివాదానికి కీలక మలుపు లభించింది. 1995 నుంచి కొనసాగుతున్న 19 కేసులను కలిపి విచారించి ఇచ్చిన ఉమ్మడి తీర్పు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు ఆస్తిగా చూపిస్తూ హక్కులు కోరిన వాదనలకు గట్టి ఎదురుదెబ్బగా నిలిచింది. ఈ భూమి విలువ ప్రస్తుత అంచనాల ప్రకారం రూ.50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ఉంటుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజల ఆస్తిగా భావించే ఈ విలువైన భూమిని పరిరక్షించేందుకు రెవెన్యూ యంత్రాంగం చర్యలు వేగవంతం చేసింది. నిజాం కాలం నుంచే ప్రభుత్వ భూమిగా రికార్డులు ఉన్నప్పటికీ కొందరు నకిలీ పత్రాలు సృష్టించి కోర్టులో కేసులు వేశారని చెప్పారు. మియాపూర్‌లోని వివాదాస్పద భూమి చరిత్ర నిజాం పాలన కాలం నాటిదని కలెక్టర్ వివరించారు. సైన్యం నిర్వహణ కోసం అప్పట్లో జాగీర్‌గా ఇచ్చిన ఈ భూమిని 1912 నాటి రికార్డుల్లోనే 'సర్కారీ పోరంబోకు'గా నమోదు చేసినట్లు తెలిపారు. 1949లో జాగీర్దారీ వ్యవస్థ రద్దయిన అనంతరం ఈ భూమి పూర్తిగా ప్రభుత్వ అధీనంలోకి వచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ, కొందరు వ్యక్తులు వివిధ పత్రాల ఆధారంగా భూమిపై హక్కులు కోరుతూ న్యాయపోరాటం కొనసాగించారని వివరించారు.

నకిలీ పత్రాల సృష్టిపై చర్యలు!

ప్రభుత్వ భూమిని తమదిగా చూపించేందుకు కొందరు వ్యక్తులు బోగస్ పత్రాలు సృష్టించి, రికార్డుల్లో అక్రమ మార్పులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. తప్పుడు ఎంట్రీలకు సహకరించినట్లు తేలే అప్పటి అధికారులపైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు



చేసి ప్రజా ఆస్తిని సొంతం చేసుకోవాలనుకునే ప్రయత్నాలను సహించబోమనే సంకేతాన్ని ఈ పరిణామం ఇచ్చింది.

400 ఎకరాలకు రక్షణ కంచె

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి తదుపరి రక్షణ చర్యలపై సమీక్షించారు. మొత్తం 550.39 ఎకరాల్లో సుమారు 400 ఎకరాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఈ భూమి హెచ్ఎండీఏ పర్యవేక్షణలో ఉందని తెలిపారు. గతంలోనే సుప్రీంకోర్టు అనుమతితో భూమి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మిగిలిన ఖాళీ స్థలాలకు కూడా స్పష్టమైన హద్దులు నిర్ణయించి, పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు.

నివాసితులకు ఊరట

వివాదాస్పద భూమిలో ఇప్పటికే సామాన్యులు నిర్మించుకున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలను ప్రస్తుతానికి తొలగించే చర్యలు చేపట్టబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. నివాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ భూమిని కాపాడటంతోపాటు అక్కడ నివసిస్తున్న ప్రజల విషయంలోనూ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

ప్రజా సంపదకు రక్షణ.. అక్రమాలకు హెచ్చరిక!

మియాపూర్‌లోని ఈ భూమిపై వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వ భూముల పరిరక్షణలో కీలక పరిణామంగా నిలిచింది. విలువైన భూములపై హక్కులు పొందేందుకు తప్పుడు పత్రాలు సృష్టించడం, అధికారిక రికార్డులను వక్రీకరించడం వంటి అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన పరిణామాలు తప్పవనే హెచ్చరికగా ఈ తీర్పును చూడవచ్చన్నారు. దశాబ్దాలుగా కొనసాగిన వివాదానికి న్యాయపరమైన పరిష్కారం లభించిన నేపథ్యంలో, భూమి ప్రభుత్వ ఆధీనంలో సురక్షితంగా ఉండేలా హద్దుల నిర్ధారణ, ఫెన్సింగ్, నిరంతర పర్యవేక్షణ కీలకమని నారాయణ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ కమిషన్ ఉపేందర్ రెడ్డి, చేవెళ్ల జోన్ కమిషన్ చంద్రకళ, చేవెళ్ల ఆర్ డీఓ శ్రీధర్, శేరిలింగంపల్లి తాసిల్దార్ మహిపాల్ రెడ్డి, హెచ్ఎండీఏ తాసిల్దార్ దివ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడలలో గెలుపొందిన ఉద్యోగులతో నార్మ్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం

మహిళా క్రీడాకారిణీల విజయం గర్వకారణం

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం) :

అక్టోబరు 23 నుంచి 26వ తేదీ వరకు జోధ్ పూర్ లో జరిగిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐసీఏఆర్) అంతర్ జోనల్ క్రీడా పోటీలలో రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్ మెంట్ (నార్మ్) కు చెందిన మహిళా అధికారుల బృందం రెండు స్వర్ణ పతకాలు, రెండు రన్నరప్ స్థానాలను కైవసం చేసుకున్నారు. వారిని శుక్రవారం నార్మ్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం అభినందించారు. నార్మ్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ గుత్తికొండ అనీజ జావెలిన్ త్రో లో స్వర్ణ పతకం సాదించారు. క్యారమ్స్ సింగిల్స్ లో నార్మ్ కు చెందిన రుక్మిణీ అమ్మాల్ స్వర్ణం సాధించారు. టేబుల్ టెన్నిస్ డబుల్స్ లో డాక్టర్ సోనా వై, రుక్మిణి అమ్మాల్ లు రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. షటిల్ బాడ్మింటన్ డబుల్స్ లో డాక్టర్ సుప్రియ, రుక్మిణీ అమ్మాల్ లు రన్నరప్ గా నిలిచారు

రాజేంద్రనగర్, అత్తాపూర్

సర్కిళ్లలలో వర్షం

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం):

శుక్రవారం సాయంత్రం 20 నిమిషాల పాటు రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలలో వర్షం కురిసింది. మండే ఎండలు, వేడి కారణంగా ఇబ్బందులకు గురౌతున్న ప్రజలు వర్షం కురవడం తో ఊపిరిపీల్చుకున్నారు. హైదర్ గూడ చౌరస్తా లో రోడ్లపై వర్షం నీరు నిలవడంతో కొద్ది సేపు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని భగవంతుణ్ణి వేడుకున్నారు.



బుద్వేల్ లో కురుస్తున్న వర్షం

బీజేపీలో చేరిన కోరని శ్యామ్



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ లో చేరిన దేశపాగ రాజు, వేముల శ్రీనివాస్, కరణం నారాయణ ముదిరాజ్, వివిధ పార్టీల నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు అయోధ్య రాముని ఫోటో ను అందచేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు కోరని సదానంద్, కోరని క్రాంతి తదితరులు



బీజేపీ లో చేరిన కోరని శ్యామ్

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీ లో చేరిన పలువురు యువకులు

బుద్వేల్, అక్టోబరు 30 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్, బుద్వేల్ ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీ లో చేరారు. బీజేపీ గోల్కొండ గోషా మహల్ జిల్లా ఇంచార్జి వై శ్రీధర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన దేశపాగ రాజు (కిరోసిన్ రాజు), కరణం నారాయణ ముదిరాజ్, వేముల శ్రీనివాస్, బ్రాహ్మణపల్లి బాల్ రాజ్ ముదిరాజ్, కోరని శ్యామ్. ఆనంద్ శర్మ, శశిధర్, దుండగుల, వినోద్, నరేందర్, శ్రీనివాస్, బి గౌతమ్, శ్రీకర్ తదితరులు బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి, బుక్క వేణుగోపాల్, రం గారెడ్డి జిల్లా నాయకులు ఎం కొమురయ్య, బొక్క బాల్ రెడ్డి, గుంజ బాబురావు, పులిమామిడి రవీందర్, ఈ వేణుగోపాల్, కరణం నర్సింహ్మ ముదిరాజ్, జి రవి, నర్సింహ్మ, రెంటాల పవన్ రాజ్, జ్ఞానేశ్వర్, అబినప్ లు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి బండి సంజయ్ ను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

ప్రజాస్వామ్య పరిరక్షణకు మహా పాదయాత్ర

నవంబర్ 2న అమిత్ షా పాదయాత్రను విజయవంతం చేయాలి

శేరిలింగంపల్లి నుంచి భారీగా తరలిరావాలని పిలుపు

శేరిలింగంపల్లి : అక్టోబర్ 30,(ప్రభాత ఉదయం)

ప్రజాస్వామ్య పరిరక్షణ, అరాచకవాదానికి వ్యతిరేకంగా పోరాటమే లక్ష్యంగా నవంబర్ 2న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొననున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని కోరుతూ చందానగర్ డివిజన్ పరిధిలోని తారా నగర్ విస్తృత ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ, మహా పాదయాత్ర ఏర్పాట్లపై పార్టీ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మార్కెట్ ప్రాంతంలో వ్యాపారులు, స్థానిక ప్రజలను కలిసి పాదయాత్రకు మద్దతుగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.



కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: అభయ్ పాటిల్

బీజేపీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జి అభయ్ పాటిల్ మాట్లాడుతూ నవంబర్ 2న నిర్వహించనున్న మహా పాదయాత్ర చారిత్రాత్మకంగా నిలవనుందని పేర్కొన్నారు. పాదయాత్రపై కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలకు వాస్తవాలను వివరించి ఆ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాదయాత్రకు లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి వేలాది మంది స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం: వీరేందర్ గౌడ్

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రతి పట్టభద్రుడికి వివరించి ఓటర్ల మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు.

భారీ జనసమీకరణకు ప్రణాళిక: రవికుమార్ యాదవ్

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ నవంబర్ 2న జరిగే మహా పాదయాత్రకు నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్, బూత్ స్థాయిల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేసి పాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పార్టీ బలోపేతంతో పాటు పాదయాత్రను విజయవంతం చేసేందుకు విస్తృత కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఆలే భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు, అజిత్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి పద్మ, బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యురాలు సింధు రెడ్డి, ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ బాల్దా అశోక్ తదితరులు పాల్గొన్నారు. పార్టీకి చెందిన రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం):

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు.శుక్రవారం కేటీదొడ్డి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు క్షేత్రస్థాయి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..”బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి, ఓటరుగా ఎలా నమోదు చేసుకోవాలో వారికి అవగాహన కల్పించాలని, ప్రతి అర్హులైన పట్టభద్రుడు ఓటరుగా నమోదయ్యేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్కోటే, మండల నాయకులు హానిమి రెడ్డి, ఎర్ర బీమ్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల గోడ పత్రిక విడుదల

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం):

కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల (జాతర) గోడ ప్రతులు (పోస్టర్లు), ఆహ్వాన పత్రికను శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆవిష్కరించారు.నవంబర్ నెల 9న శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవం, 10న రథోత్సవం, 11న స్వామివారి పల్లకీ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పురేందర్ తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఏటా లాగే ఈ సంవత్సరం కూడా పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.”తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ పొరుగు రాష్ట్రాల నుండి విశేష సంఖ్యలో వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, ఆలయ కమిటీ అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి, వెంకటాపురం గోపి, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, గోవిందు, చంద్రశేఖర్ రెడ్డి, ఆలూర్ రామయ్య శెట్టి, కురమన్న, ప్రవీణ్, ధర్మ నాయుడు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలి

లేదా ఎకరాకు 30 లక్షలు పరిహారం ఇవ్వాలి





జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం):

గట్టు , కేటిదొడ్డి మండలాల మధ్య నిర్మాణం జరుగుతున్న నల్ల సోమనాద్రి (గట్టు) ఎత్తిపోతల పథకం కుడి , ఎడమ ప్రధాన కాలువల నిర్మాణం కోసం రైతుల నుండి సేకరిస్తున్న భూములకు భూమికి భూమి ఇవ్వాలని, లేదా ఎకరాకు రూ. 30 లక్షల పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం కాలువల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మరియు భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రైతులు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏ వెంకటస్వామి మాట్లాడుతూ....గట్టు ఎత్తిపోతల పథకం కుడి ప్రధాన కాలువ నిర్మాణం కోసం కేటిదొడ్డి గ్రామ శివారు పరిధిలో 94 ఎకరాల భూమి ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం కోసం కుచినేర్ల, రాయపురం, చింతలకుంట, అప్ప కొండహళ్లి, మాచర్ల , బలిగెర గ్రామ శివారులలో 156 ఎకరాల భూమి.మొత్తం కుడి మరియు ఎడమ ప్రధాన కాలువల నిర్మాణం కోసం రెండు మండలాలు 7 గ్రామాల పరిధిలో దాదాపు 600 నుండి 800 మంది రైతుల నుండి 250 ఎకరాల భూమి సేకరించేదుకు అధికారులు రైతులకు నోటీసులు పంపిస్తున్నారని తెలిపారు. గతంలో గట్టు ఎత్తిపోతల పథకం మరియు భారత్ మాల రోడ్డు నిర్మాణం సందర్భంగా మోసపోయిన రైతులు ప్రస్తుతం నోటీసులు తీసుకునేందుకు సిద్ధపడటం లేదని తెలిపారు. గతంలో భూమి సేకరించిన సందర్భంగా ఎకరాకు 12 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి కేవలం 6 లక్షల రూపాయలు ఇచ్చి మోసం చేశారని అందుకే ఇప్పుడు భూములు ఇవ్వటానికి సిద్ధపడటం లేదని రైతులు చెప్పినట్లుగా తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం కచ్చితంగా అమలు చేసి ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ లో ఇచ్చిన విధంగా ఎకరాకు 30 లక్షల రూపాయలు ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు వివి. నరసింహ రైతులు ప్రభుదాసు, వీరేష్, గోవిందు, శంకర్, సురేష్, తిమ్మప్ప, కంబయ్య, ఎర్రన్న, మౌలాలి, గోవిందమ్మ, కురుమక్క తదితరులు పాల్గొన్నారు.



సైబరాబాద్ అభివృద్ధికి ‘సైబరాబాద్ మూవ్స్’

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యం..

శేరిలింగంపల్లి : అక్టోబర్ 30,(ప్రభాత ఉదయం)

సైబరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సైబరాబాద్ పోలీసులు, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో ‘సైబరాబాద్ మూవ్స్ కమ్ మేక్ యువర్ మూవ్’ కార్యక్రమాన్ని రూపొందించినట్లు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ తెలిపారు. సైబరాబాద్ మూవ్ కమ్ మేక్ యువర్ మూవ్ సీఎంసీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎంసీ కమిషనర్ సృజన మాట్లాడుతూ హైదరాబాద్ కు సైబరాబాద్ గ్రోత్ ఇంజిన్ లాంటి ప్రాంతమని తెలిపారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న వారిలో సగం మంది సైబరాబాద్ పరిధిలోనే ఉన్నారని, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వివిధ కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ శాఖలను భాగస్వాములుగా చేస్తూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రజలను ప్రధాన భాగస్వాములుగా చేర్చి, వారి సూచనలు, సలహాల ఆధారంగా మెరుగైన పరిష్కారాలను రూపొందిస్తామని వెల్లడించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. రోజుకి 2,000కు పైగా కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తుండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రోడ్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాల్లో ప్రజల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం ‘మొబిలిటీ డేటా జామ్’ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రహేజా మైండ్‌స్పేస్‌లో లక్ష మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఇలాంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీ హబ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని, ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ ఆలోచనలు, సూచనలు అందించవచ్చని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలతో పాటు శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించేలా వినూత్న పరిష్కారాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామని, ప్రజలందరినీ భాగస్వాములుగా చేయడమే ‘సైబరాబాద్ మూవ్స్’ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని సీపీ రమేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమం సైబరాబాద్ జాయింట్ సీపీ సుప్రిమ్ ప్రీత్ సింగ్ తోపాటు ట్రాఫిక్ డీసీపీలు డిప్యూటీ కమిషనర్ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాలో అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లులపై చర్యలేవి?

కేసులు పెట్టకుండా అధికారుల జాప్యం

మామూళ్ల మత్తులో పౌరసరఫరాల శాఖ!

అన్ని మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం మాయమైనా.. ఉన్నట్లే నివేదికలు!

తేడాలను సరిచేసేందుకు లక్షల రూపాయల మామూళ్లు?

గద్వాల, ఇటిక్యాల మండలాల్లో రూ. 60 కోట్ల ధాన్యం పక్కదారి!

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30(ప్రభాత ఉదయం)

జోగులాంబ గద్వాల జిల్లాలో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల మధ్య నడుస్తున్న ‘లాలూచీ డ్రామా’ ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా కలకలం రేపుతోంది. రాష్ట్ర సివిల్ సప్లైస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు జరిపిన మెరుపు దాడుల్లో ఏకంగా రూ. 60 కోట్ల విలువైన సీఎంఆర్ (జబర్‌శీఎ వీఅశ్రీశ్రీఅఅస్త్ర =అఎవ) ధాన్యం మాయమైనట్లు ఆధారాలు లభించినా, క్షేత్రస్థాయి అధికారులు మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా జాప్యం చేస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు!

గద్వాల, ఇటిక్యాల సహా పలు మండలాల్లో ధాన్యాన్ని అక్రమంగా పక్కదారి పట్టించినట్లు వెల్లడవడంతో.. అక్రమాలకు పాల్పడిన మూడు రైస్ మిల్లుల యజమానులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కానీ, జిల్లా పౌరసరఫరాల అధికారులు మాత్రం ఆ ఆదేశాలను బుట్టదాఖలు చేస్తూ మిల్లర్లను కాపాడేందుకు రక్షణ కవచంలా నిలుస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రీ-వెరిఫికేషన్ పేరిట పైరవీలు ఉ తాయిలాలు

గద్వాల మండలంలో ఒక ప్రముఖ రైస్ మిల్లులో 2025-26 సంవత్సరానికి సంబంధించి తనిఖీలు చేపట్టగా, ఏకంగా 50,000 బస్తాల ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు కనుగొన్నారు. కేసులు నమోదు చేయకుండా మిల్లర్లు “రీ-వెరిఫికేషన్” (మళ్లీ లెక్కింపు) అభ్యర్థనల పేరిట ముమ్మరంగా పైరవీలు ప్రారంభించారు. మిల్లుల్లో ధాన్యపు గింజ కూడా లేకపోయినా, తనిఖీలకు వెళ్లిన అధికారులకు లక్షల్లో మామూళ్లు, తాయిలాలు ముట్టజెప్పి ధాన్యం లెక్కలన్నీ సరిపోయినట్లు నివేదికలు రాయించుకోవడం గమనార్హం.

జిల్లా కేంద్రంలో జోరుగా చర్చ!

ప్రజాధనాన్ని, రైతుల కష్టాన్ని నిలువునా దోచేస్తూ ఆ సొమ్ముతో రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారాలు చేస్తున్న అక్రమ మిల్లర్లపై చర్యలు తీసుకోకుండా.. లంచాల మత్తులో తూగుతూ అధికారులు ఆ మిల్లుల వైపు కన్నెత్తి చూడకపోవడంపై జిల్లా ప్రజలు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన అక్రమ మిల్లర్లపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారిని అరెస్టు చేయాలని.. అలాగే మిల్లర్ల వద్ద మామూళ్లు పుచ్చుకుని అక్రమాలను కప్పిపుచ్చుతున్న పౌరసరఫరాల శాఖ అధికారులపై కూడా విజిలెన్స్ విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608